

చెరువు ఆక్రమణను అడ్డుకోండి

- కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా సింగుపురం పంచాయతీ పరిధిలోని చెరువును స్థానిక సర్పంచ్ ఆక్రమించారని ఆరోపిస్తూ దాఖలైన పిల్ పై హైకోర్టు స్పందించింది. చెరువులో ఆక్రమణలు తొలగించి, దాని రక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది. అనంతరం నివేదికను కోర్టు ముందు ఉంచాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. శ్రీకాకుళం రూరల్ సింగుపురం గ్రామపంచాయతీలో చెరువును స్థానిక సర్పంచ్ ఆదిత్యనాయుడు ఆక్రమించారని పేర్కొంటూ ఎంపీటీసీ అప్పారావు మరో ఐదుగురు హైకోర్టులో పిల్ వేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది విద్యావతి వాదనలు వినిపించారు. ఆక్రమణలకు సంబంధించి ఫొటోలను కోర్టు ముందు ఉంచారు.

అడిగేదెవరు ఆపేదెవరు?



మెళియాపుట్టి పోలీసుస్టేషన్ ఎదురుగా ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

- మెళియాపుట్టిలో ఆక్రమణల జోరు
- పట్టించుకోని అధికారులు

(మెళియాపుట్టి)

మెళియాపుట్టిలో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. మండల కేంద్రంలో సెంటు భూమి రూ.2లక్షలకు పైగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. ఎక్కడైనా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. ముందు వరిగడ్డి కుప్ప వేస్తారు. కొన్నిరోజుల తర్వాత కర్రలతో చుట్టూ కంచె వేస్తారు. మరికొన్ని రోజుల తర్వాత ఇనుప కంచె వేసి.. ఆపై భవనాలు నిర్మిస్తున్నారు. వాటిని విక్రయించి రూ. లక్షలు సంపాదిస్తున్నారు. అడిగేవారు లేక.. అక్రమ నిర్మాణాలను ఎవరూ ఆపే ధైర్యం చేయకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

- మెళియాపుట్టిని ఆనుకుని కొండ భాగంలోని సర్వేనెంబర్ 486లో సుమారు 398 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కొండకు ఇటువైపు మెళియాపుట్టి, అటు చాపర ఉంది. మండల కేంద్రానికి సమీపాన ఉండడంతో ఇక్కడ భూములకు గిరాకీ ఏర్పడింది. గతంలో పరిశ్రమల నిర్మాణానికి 70 ఎకరాలు, ఉద్దానం వాటర్‌గ్రిడ్‌కు 10ఎకరాలు, ఏకలవ్య పాఠశాలకు 15ఎకరాలు, కస్తూర్బా పాఠశాలకు 5ఎకరాలు, స్థానిక జడ్పీ పాఠశాలకు 5 ఎక రాలు కేటాయించారు. సాయిబాబా ఆలయానికి, పార్కు కోసం మరికొంత భూమిని కేటాయించారు. జగనన్న లేఅవుట్లు కూడా ఇక్కడే ఏర్పాటు చేశారు. అధికంగా కొండ భాగంలో భవనాలు కేటాయించడంతో భూముల విలువ పెరగడంతో అక్రమార్కులు ఆక్రమించి.. సొమ్ము చేసుకుంటున్నారు. రోడ్డు పక్కన స్థలాలను ఆక్రమించి.. దుకాణాలు ఏర్పాటు చేశారు. టెక్కలి-మెళియాపుట్టి, మెళియాపుట్టి-చాపర మార్గాల్లో అధికంగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రైవేటు వెంచర్లు కూడా అధికంగా వెలిశాయి. అధికారులెవరూ ఆక్రమణలను అడ్డుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత తహసీల్దార్ పి.సరోజిని కొంతమేర ఆక్రమణలకు అడ్డుకట్ట వేశారు. ఎన్నికల వేళ.. బదిలీ జరుగుతుందని తెలిసి ఆమె రెండు నెలలుగా ఆక్రమణలపై ఆమె దృష్టి సారించలేదు. ఇదే అదునుగా ఆక్రమణలు పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల తహసీల్దార్ పి.సరోజిని బదిలీ కాగా.. ఆమె స్థానంలో విశాఖ నుంచి జానకమ్మ బాధ్యతలు స్వీకరించారు. కొత్త తహసీల్దార్ స్పందించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



టెక్కలి రహదారిలో ఆక్రమణలు



మెళియాపుట్టిలోని ప్రభుత్వ భూమిలో గడ్డి కుప్పలు వేసి ఆక్రమణ

ఐటీడీఏ వస్తుందనే..

జిల్లా పునర్విభజన తర్వాత మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తారనే ప్రచారం సాగడంతో భూములకు విలువ పెరిగింది. ఎకరా రూ.2కోట్లు పైమాటే. ఈక్రమంలో గతంలో ఉన్న జీడిమొక్కలను సైతం తొలగించి.. చదును చేసి స్థలాలు విక్రయిస్తున్నారు. పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమి సైతం ఆక్రమణకు గురవుతోంది. రోజురోజుకీ ఆక్రమణలు పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ ఉణ్ణ శంకర్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఆక్రమణలపై తమకు ఫిర్యాదులు అందలేదన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి.. ఆక్రమణలు పరిశీలిస్తామని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పరీక్ష ముగిసే వరకు ఉండాల్సిందే

- రేపటి నుంచే ఇంటర్ పరీక్షలు
- కేంద్రాల్లోకి అరగంట ముందుగానే అనుమతి
- పకడ్బందీగా ఏర్పాట్లు: ఆర్‌ఐవో కృష్ణారావు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)



ఆర్‌ఐవో కృష్ణారావు

ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పక్కాగా నిబంధనలు అమలు చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ప్రగడ కృష్ణారావుతో 'ఆంధ్రజ్యోతి' బుధవారం ఇంటర్వ్యూ నిర్వహించింది. ఈ మేరకు పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు, అమలు చేయనున్న నిబంధనలు ఆయన వివరించారు. గతంలో మాదిరి ఆఖరి అరగంట ముందు కాకుండా.. పరీక్ష ముగిసే వరకూ విద్యార్థులు కేంద్రంలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. 'జిల్లా వ్యాప్తంగా 83 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి మార్చి 20వరకు జరగనున్నాయి. జనరల్ విద్యార్థులు 43,071 మంది, వృత్తివిద్యాకోర్సులకు చెందినవారు 2,631 మంది మొత్తం 45,702 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. 19,937మంది ప్రథమ సంవత్సరం, 25,765 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. నిర్దిత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించం. పరీక్ష సమయం ముగిసే వరకూ బయటకు విడిచి పెట్టేది లేదని ఆర్‌ఐవో తెలిపారు.

- '83మంది చొప్పున చీఫ్‌సూపరింటెండెంట్లు, డెవలప్‌మెంట్ అధికారులతోపాటు 1600 మంది ఇన్విజిలేటర్లను కేటాయించాం. అన్ని కేంద్రాల్లోనూ.. మొత్తం 1,480 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. లైవ్ స్ట్రీమింగ్ పద్ధతిలో పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తాం. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి.. అక్కడ నుంచి నిరంతర పరిశీలన చేస్తాం. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నియమించాం. డిస్ట్రిక్ట్ ఎక్జామినేషన్ కమిటీ(డెక్) ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుంది. డెక్ 1, డెక్ 2, డెక్ 3 విభాగాలుగా.. మూడు ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ నిరంతరంగా పలు కేంద్రాలను తనిఖీ చేస్తారు. కన్వీనర్‌గా ఆర్‌ఐవో(నేను), ప్రత్యేక పరిశీలకులుగా డీవీఈవో కె.ప్రకాశరావు వ్యవహరిస్తూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తామ'ని ఆర్‌ఐవో కృష్ణారావు తెలిపారు.

వాసుదేవ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న మహిళలు

హరిపురం, ఫిబ్రవరి 28: మందసలో శ్రీ వాసుదేవ పెరుమాళ్ ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు బుధవారం ఆలయ ప్రధాన వేదపండితులు కూర్మాచార్యులు ఆధ్వర్యంలో.. వాసుదేవ పెరుమాళ్ ఆలయం ఆవరణలోని ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకం చేపట్టారు. బ్రహోత్సవాలు విజయవంతంగా సాగేలా చూడాలని ఆనవాయితీ ప్రకారం ముందుగా ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. స్వామికి ఆలయ కార్యక్రమ దాతలైన డోకి రామారావు, భాగ్యలక్ష్మి దంపతులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాల్లో నివేదన, గోష్ఠిని చేపట్టి ప్రసాదగోష్ఠితో ముగించారు. సాయంత్రం 5గంటలకు శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం చేపట్టి తీర్థగోష్ఠిని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గోవింద స్వామి, నిత్యానంద పాడీతోపాటు పలువురు వేదపండితులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం ఉదయం 9గంటలకు వాసుదేవ పెరుమాళ్ అభిషేకం, అన్నమయ్య సంకీర్తన, అంకురార్పణ బ్రహ్మోత్సవారంభము, జీయర్ స్వాముల అనుగ్రహభాషణం నిర్వహిస్తారు. 11 గంటలకు గాత్ర కచేరీ, 3 గంటలకు శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం, సేవాకాలం 6గంటలకు తీర్థగోష్ఠి, విష్వక్సేన ఆరాధన, పుణ్యావాహవచనంవంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జీడి వ్యాపారులకు టోకరా

- రూ.2.5కోట్ల పిక్కలు ఇవ్వకుండా ముఖం చాటేసిన బ్రోకర్లు
- వారికి సహకరిస్తున్న వైసీపీ ప్రముఖుడు
- లబోదిబోమంటున్న బాధితులు

(పలాస)



ఓ గ్లోబల్ సంస్థకు చెందిన బ్రోకర్ల చేతిలో పలాస జీడి వ్యాపారులు చిక్కుకున్నారు. ఇండెంట్ ప్రకారం రూ.2.50కోట్ల విలువైన జీడిపిక్కలు ఇవ్వకుండా బ్రోకర్లు మొహం చాటేయడంతో లబోదిబోమంటున్నారు. బ్రోకర్లకు స్థానిక వైసీపీ ప్రముఖుడు ఒకరు సహకరించడంతో.. వ్యాపారులు ఆందోళన చేపట్టారు. ఈ వ్యవహారం మంత్రి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో అయోమయం చెందుతున్నారు. ఆ డబ్బులు ఎలా రాబట్టుకోవాలో తెలియక తర్జనభర్జన పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

శ్రీకాకుళం నుంచి చక్రం తిప్పే ఓ గ్లోబల్ సంస్థ బ్రోకర్లు.. తాము అంతర్జాతీయ మార్కెట్ చేస్తామని, తక్కువ ధరకే జీడి పిక్కలు విదేశాల నుంచి తీసుకువచ్చి ఇస్తామని, తమకు సహకరించాల్సిందిగా అభ్యర్థించారు. దీంతో పలాస- కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన మొత్తం 15మంది వ్యాపారులు 18వేల(1500 టన్నులు) జీడి పిక్కల బస్తాలకు ఇండెంట్ పెట్టారు. వారికి ముందస్తుగా రూ.కోట్లు కట్టబెట్టారు. ఒప్పందం ప్రకారం వ్యాపారులకు 8వేల (483 టన్నులు) బస్తాలు బెనిన్ దేశం నుంచి రప్పించి అందించారు. అందులో కొన్ని బస్తాల్లో పిక్కలు నాణ్యత లేకపోవడంతో.. డబ్బులు తగ్గించి ఇచ్చేందుకు వ్యాపారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. విదేశీ పిక్కలను తీసుకువచ్చే స్వదేశీ బ్రోకర్‌కు పలాసలో ఉన్న ఓ జీడి ప్రముఖుడు మధ్యవర్తిగా వ్యవహరిస్తూ ఈ తతంగాన్ని నడిపించారు. కాగా, మిగిలిన 10వేల బస్తాల జీడి పిక్కలు వ్యాపారులకు అందజేయకుండా తిప్పుతుండడంతో వ్యాపారులు ఆ బ్రోకర్లను నిలదీశారు. ఫలితం లేకపోవడంతో సమస్య పరిష్కారమయ్యే వరకూ ఆ బ్రోకర్లు నిర్వహిస్తున్న సంస్థ ద్వారా జీడి పిక్కలు ఇతరులు ఎవరూ కొనుగోలు చేయవద్దని, ఈ పిక్కలు కూడా అన్‌లోడింగ్ చేయకూడదని వ్యాపారులు, కార్మిక సంఘాలు నిర్ణయించుకున్నాయి.

- ఇదిలా ఉండగా ఆ సంస్థకు వారం రోజుల కిందట లారీల్లో జీడిపిక్కలు దిగుమతి కోసం వచ్చాయి. కార్మికులు ఎవరూ వెళ్లకపోగా వైసీపీ ప్రముఖుడు ఒకరు ఇందులో జోక్యం చేసుకొని తన మందీమార్బలంతో లారీల్లో ఉన్న సరుకును గోదాముల్లో దింపడంతో వ్యాపారులు ఆందోళనకు దిగారు. నిర్వాహకులను నిలదీశారు. తమ సమస్య పరిష్కారం కావాలని, వ్యాపారులకు రావాల్సిన రూ.2.50 కోట్ల నగదు ఇవ్వాలని, లేదంటే నాణ్యమైన జీడి పిక్కలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వైసీపీ ప్రముఖుడు, వ్యాపారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సమస్య మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దృష్టికి వ్యాపారులు తీసుకెళ్లారు. ఇరువురూ ఒకే పార్టీకి చెందినవారు కావడంతో ఆయన మౌనం దాల్చారు. చివరకు పొరుగు మండలంలో ఉన్న ఓ ప్రముఖ వ్యక్తి వద్దకు పంచాయితీ చేరింది. వారం రోజులుగా ఇది నడుస్తోంది. ఈ వ్యవహారంలో బ్రోకర్ల కారణంగా తాము నష్టపోయామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- గతంలో బ్రోకర్ల చేతిలో వందలాది మంది జీడి వ్యాపారులు రోడ్డున పడ్డారు. జీడిపప్పు కొనుగోలు చేయాలన్నా, విక్రయించాలన్నా అంతా బ్రోకర్లపై ఆధారపడాల్సి వస్తుండడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే క్యాజూ బోర్డు ఏర్పాటు చేసి వ్యాపారులు, రైతుల సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపితే ఇటువంటి సమస్యలు ఉండవని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

శివరాత్రి ఉత్సవాల్లో సమన్వయంతో పనిచేయండి

- శ్రీకాకుళం ఆర్డీవో రంగయ్య



మాట్లాడుతున్న ఆర్డీవో రంగయ్య

జలుమూరు, ఫిబ్రవరి 28: శ్రీముఖలింగంలో మార్చి 8 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, ఉచితంగా ప్రసాదం పంపిణీ చేయాలని దేవదాయ శాఖాధికారులను ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్య సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. అన్ని వీధుల్లో తాగునీటి సదుపాయం కల్పించాలని, అవసరమైతే ట్యాంకర్లతో నీటిని సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. తాత్కాలిక మరుగుదొడ్ల సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. చక్రతీర్థ స్నానాలకు సరిపడా నీటిని వంశధార నదిలో విడిచిపెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పటిష్టభద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఆర్డీవో శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, డీఎల్పీవో ఆర్.గోపిబాబు, డీటీ పి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.దామోదరరావు, ఈవో పి.ప్రభాకరరావు, ఎంపీపీ వాన గోపి, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం పాల్గొన్నారు.

సమాజ సేవే.. సైన్స్ ధ్యేయం

- జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు
- రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు మూడు ప్రాజెక్టుల ఎంపిక



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈవో

టెక్కలి, ఫిబ్రవరి 28: 'సమాజ సేవే సైన్స్ ధ్యేయం. సమాజంలో సమస్యలు గుర్తించి సాంకేతిక పరిష్కారాలు చూపడమే సైన్స్ లక్ష్యమ'ని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఐతమ్ అటల్ ఇన్నోవేషన్ ఛాలెంజెస్, సమగ్ర శిక్ష పాఠశాల విద్య ఎస్‌సీఈఆర్‌టీ, యూనిసెఫ్ విజ్ఞాన్ ఆశ్రమ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఇన్‌స్పెయిర్ మనక్ అవార్డులను ప్రకటించారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు మూడు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. 'పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.గాయత్రి, జశ్వంత్ పాత్రో, ఢిల్లేశ్వరరావులు తయారుచేసిన మహిళా రక్షణ-స్మార్ట్ స్టిక్ తయారీ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. పాతపట్నం మోడల్‌స్కూల్‌కు చెందిన రోహిత్‌సాయి, ప్రీతిం, నితీష్ తయారుచేసిన ఒకే యంత్రంతో అనేక పనులు చేసే రోబోట్ ద్వితీయస్థానం దక్కించుకుంది.

ఇప్పిలి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన డి.నవీన్‌కుమార్, దివాకర్, వికాస్‌కుమార్ రూపొందించిన ట్రాకింగ్ సోలార్‌సిస్టమ్‌కు జిల్లాస్థాయిలో తృతీయ స్థానం పొందింది. వీరిని రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు పంపనున్నాం. బాల్యం నుంచే సైన్స్‌పై విద్యార్థులు శ్రద్ధ చూపేలా ఉపాధ్యాయులు కృషి చేయాల'ని డీఈవో సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామి, ఏపీడీ రోణంకి జయప్రకాష్, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.

దోష రహిత ఓటర్ల జాబితా తయారీకి చర్యలు

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 28: జిల్లాలో పారదర్శక, దోష రహిత అనుబంధ(సప్లిమెంట్) ఓటర్ల జాబితాల రూపకల్పనకు యంత్రాంగం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో అనుబంధ ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు, ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ ఎం.నవీన్‌తో కలిసి 35వ వారాంతపు సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'గడిచిన వారం రోజుల్లో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు కోరుతూ 2,715 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల్లో పోలింగ్ కనీసం 75 శాతానికి మించి ఉండాలనే లక్ష్యంతో ఓటర్లకు అవగాహన కల్పించే స్వీప్ కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నాం. 80ఏళ్లు దాటిన, నడవలేని, మంచం పట్టిన, విభిన్న ప్రతిభావంతులైన ఓటర్లకు.. ఇంటి వద్దనే ఓటింగ్ నిర్వహణపై పరిశీలిస్తున్నాం. ఇలా జిల్లాలో 49,957మంది ఓటర్లను గుర్తించాం. వీరు ఇంటి నుంచే ఓటు వేసేందుకు వీలుగా ఫారం-12డి ముందుగా సమర్పించాలి. ఎన్నికల సమయంలో నగదు, మద్యం పంపిణీ చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. ఫిర్యాదుల కోసం 18004256625 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామ'ని తెలిపారు. సమావేశంలో డీఆర్వో గణపతిరావు, పీఎంజే బాబు(టీడీపీ), రౌతు శంకరరావు(వైసీపీ), సురేష్‌సింగ్‌బాబు(బీజేపీ) పాల్గొన్నారు.



డచ్ బంగ్లాలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ఆర్‌అండ్‌బీ అతిథిగృహం సందర్శన

రోడ్లు భవనాల శాఖ అతిథి గృహాన్ని, కాటేజీలు, పరిసర ప్రాంతాలు, 17వ శతాబ్దపు డచ్ భవనాన్ని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ బుధవారం సందర్శించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి మరమ్మతులు చేసి, సుందరంగా తీర్చిదిద్దాలని డీఈ, ఏఈలకు ఆదేశించారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఈవీఎం గొడౌన్లను కలెక్టర్ తనిఖీ చేశారు. గొడౌన్లలో రక్షణ వలయాన్ని పరిశీలించి.. భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ కూర్మారావు, చక్రవర్తి, ఎస్ఈ జాన్ సుధాకర్, ఈఈ రవినాయక్, జెఈ పీటీ రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న ఇళ్ల స్థలాలు.. రాళ్లపాలు

వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు పంచాయతీకి కేటాయించిన జగనన్న ఇళ్ల స్థలాలు రాళ్లకుప్పలుగా మారాయి. ఈ పంచాయతీకి చెందిన 18మందికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయి. గ్రామానికి దూరంగా.. నిర్మానుష్య ప్రాంతంలో స్థలాలు కేటాయించడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపలేదు. వారికి స్థానిక నాయకులు ఎంత ఒప్పించినా ముందుకు రాలేదు. దీంతో కొంతమందికి బెండికొండ వద్ద స్థలాన్ని కేటాయించారు. కాగా.. డోకులపాడులో జగనన్న ఇళ్ల స్థలాలకు పక్కనే మెట్ట ఉంది. ఇటీవల కొన్ని ప్రభుత్వ భవనాలు నిర్మాణానికి ఈ మెట్ట నుంచి గ్రావెల్, రాళ్లు తరలించారు. దీంతో ప్రస్తుతం ఇళ్లస్థలాలు రాళ్లు, మట్టితో నిండిపోయిందని లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మాణానికి అనువైన ప్రాంతంలో స్థలాలు కేటాయించాలని కోరుతున్నారు. ఈ విషయమై మండల హౌసింగ్ ఏఈ శ్రీకాంత్ షాహు వద్ద ప్రస్తావించగా.. గ్రామానికి దూరంగా స్థలాలు కేటాయించడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదన్నారు. దీంతో ఆసక్తి ఉన్నవారికి బెండికొండవద్ద ఇళ్ల స్థలాలు కేటాయించామని తెలిపారు.

\- వజ్రపుకొత్తూరు

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

● సర్ సీవీరామన్‌కు ఘన నివాళి
● అన్ని పాఠశాలల్లోనూ జాతీయ సైన్స్ దినోత్సవం
● ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్టులను తయారుచేసి ప్రదర్శించారు. ఉత్తమంగా ఎంపికైన ప్రాజెక్టు లకు ఎంఈవోలు, హెచ్ఎంలు బహుమతులు అందించారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి వెలికితీతకు ఇటువంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయని ఉపాధ్యాయులు అన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

-ఆంధ్రజ్యోతి బృందం



గార: వమరవెల్లి డైట్‌లో శాస్త్రవేత్తల వేషధారణ వేసిన మోడల్ స్కూల్ విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్.తిరుమల చైతన్య తదితరులు



వజ్రపుకొత్తూరు: దోకులపాడు హైస్కూల్‌లో విజేతలకు బహుమతి ప్రదానం



నరసన్నపేట: సత్యవరం పాఠశాలలో విజ్ఞాన శాస్త్రవేత్తల చిత్రపటాల ప్రదర్శన



హిరమండలం: కేజీబీవీలో విద్యార్థినులు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



ఎచ్చెర్ల: ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థుల ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తున్న ఆర్జీయూకేటీ చాన్సలర్, ప్రొఫెసర్ కేసీరెడ్డి



సరుబుజ్జిలి: రొట్టవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శనలు



పొందూరు: తోలాపి పాఠశాలలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న మండల విద్యాశాఖాధికారులు



ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్



బూర్జ: ఓవీపేట ఆదర్శ పాఠశాలలో ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థినులు



నందిగాం: పెద్దతామరాపల్లి పాఠశాలలో సైన్స్ ప్రయోగాలతో విద్యార్థినీ విద్యార్థులు



జలుమూరు: లింగాలవలస ఉన్నత పాఠశాలలో సర్ సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళి

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



కాశీబుగ్గ: సైన్స్ ప్రాజెక్టులను తిలకిస్తున్న మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు

కాశీబుగ్గ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని పలాస-కాశీబుగ్గ మునిసిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. బుధవారం చినబడాం శ్రీసాయి శిరీషా హైస్కూల్లో సైన్స్‌డే నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. స్కూల్ కరస్పాండెంట్ కవిటి భారతి మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నమైన, సృజనాత్మకమైన 76 ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి



సైన్స్ నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గుజరాతీపేట: స్థానిక వికాస్‌స్కూల్‌లో సీవీ రామన్ జయంతి వేడుకల్లో భాగంగా విజ్ఞాన ప్రదర్శన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధరకాల ప్రాజెక్టులను ప్రదర్శించగా పాఠశాల యాజమాన్య ప్రతినిధి కూన వేణుగోపాలరావు, ఉపాధ్యక్షుడు మురళి పరిశీలించారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉండే నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఉపకరిస్తాయన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు వావిలపల్లి జగన్నాథంనాయుడు, హరికా ప్రసాద్, చింతాడ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభ దాగి ఉందని, బయట ప్రపంచానికి తెలిసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ నిర్మలాదేవి, ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యతా లోపాలు కనిపిస్తే బిల్లుల నిలుపుదల



కేరాశింగి రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఉపాధి ఏపీడీ శైలజ

మెళియాపుట్టి: మండలంలోని కొండలపై ఉన్న గ్రామాలకు వేస్తున్న రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపం కనిపిస్తే బిల్లులు నిలుపుదల చేస్తామని టెక్కలి ఉపాధి ఏపీడీ శైలజ అన్నారు. ఈనెల 6న 'ఆంధ్రజ్యోతి'లో 'గిరిజనులంటే ఇంత నిర్లక్ష్యమా' శీర్షికతో వచ్చిన కథనంపై ఐటీడీఏ పీవో కల్పనాకుమారి స్పందించారు. ఈ మేరకు పనులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఏపీడీని ఆదేశించారు. ఈ మేరకు ఆమె బుధవారం కేరాశింగి, చందనగిరి, అడ్డివాడ, గూడ రహదారి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఆమెతో పాటు ఏపీవో రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

మినీ స్టేడియం స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలింస్తున్న జేసీ నవీన్

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని జేసీ ఎం.నవీన్ బుధవారం పరిశీలించారు. ఆట స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామ యువకులు వినతి పత్రం ఇవ్వడంతో పాటు సొంత నిధులతో స్థలం చదును చేసుకున్నారు. దీంతో క్రీడా స్థలం మంజూరుకుగాను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ జానకమ్మ, ఆర్ఐ వైకుంఠ రావు తదితరులున్నారు.

'ఉపాధి' ప్రణాళికలు తయారుచేయాలి

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది చేపట్టనున్న పనుల ప్రణాళికలను ప్రభుత్వ నిబంధ నల మేరకు తయారుచేసి అందించాలని ఉపాధి ఏపీవో కె.శ్రీదేవి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రైత్వారి పనులు లేనందున కూలీలకు అవసరమైన పనులను గుర్తించాలన్నారు. చెరు వులు, కాలువలకు అనుసంధానంగా ఉన్న బట్టిలను గుర్తించి రైతుల పొలాలకు ప్రయోజనం కలిగేలా పనులను చేపట్టాలన్నారు. పనులను గుర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిచే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఈసీ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



నిరాహార దీక్ష చేపడుతున్న భవన నిర్మాణ కార్మికులు

నరసన్నపేట: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం నాయకులు బుధవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు టి.లక్ష్మణ రావు, టి.వెంకట్రావు, బోర వెంకట్రావు, రాము మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికు సంక్షేమ నిధిని వారికే వినియోగించాలని, పెండింగ్ క్లైములను వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన 1214 మెమోను రద్దు చేయాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకు రిలే దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ దీక్షలకు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సంఘీభావం తెలిపారు. టీడీపీ భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.సురేష్‌బాబు, భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా నాయకుడు మణికొండ ఆది నారాయణమూర్తి సంఘీభావం తెలిపారు.

ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారించాలి

మెళియాపుట్టి: ఇంటి పన్ను వసూలుపై కార్యదర్శులు దృష్టి సారించాలని డీఎల్పీవో రమణ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తసంపద కేంద్రాలను వినియోగించడం ద్వారా పంచాయతీల ఆదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏవో తిరుపతి పట్నాయక్, కార్యదర్శులు అప్పారావు, శివాజీ మోహన్, డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీఈఈగా కృష్ణమూర్తి



టెక్కలి: ట్రాన్స్‌కో టెక్కలి డివిజన్ డీఈఈగా సీహెచ్ కృష్ణమూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు డీఈఈగా పనిచేసిన సంపతిరావు శ్రీనివాస్ శ్రీకాకుళం జిల్లా స్టోర్స్‌కు బదిలీ అయ్యారు.

కిడ్నీ పరిశోధనా కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రామనరేష్



పలాస: కిడ్నీ పరిశోధనా కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎండీ ఫిజీషియన్ పొన్నాడ రామనరేష్‌ను నియమిస్తూ జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి బుధవారం రాత్రి ఉత్తర్వులు అందాయి. ఈయన ప్రస్తుతం సోంపేట సీహెచ్‌సీలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో ఆయన ప్రముఖ వైద్యుడిగా గుర్తింపు పొందారు.

ఎంపీడీవోగా రామకృష్ణరాజు



పాతపట్నం: ఎంపీడీవోగా కె.రామకృష్ణ రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంటరీ నియోజకవర్గపరిధిలో స్వగ్రామాలకు చెందిన అధికారుల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన వెంకన్నబాబును జి.సిగడాం బదిలీ కాగా అక్కడ ఎంపీడీవోగా ఉన్న రామకృష్ణరాజు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది అభినందించారు.

పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులపై దృష్టి సారించండి

● రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్



అధికారులతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్

టెక్కలి, ఫిబ్రవరి 28: నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులపై దృష్టి సారించాలని టెక్కలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ స్టేషన్లలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, దివ్యాంగుల నిమిత్తం ర్యాంపులు ఉన్నవీ, లేనివీ పరిశీలించి వాటిని ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో సెక్టోరియల్ అధికారికి ఎనిమిది నుంచి పది వరకు పోలింగ్ స్టేషన్లు అప్పగించడం జరిగిందన్నారు. ఈ పరిధిలో గతంలో క్రిమినల్ కేసులున్న వారు ఎవరైనా ఉంటే గుర్తించాలని, అలాగే అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉంటే గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలకు పేర్లు మారిస్తే తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఏఆర్వోలు, ఎలక్షన్ డీటీ శంకర్ తదితరులు పాల్గొన్నారు. ● **హిరమండలం:** పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ బి.సుధాకర్ అన్నారు. బుధవారం ఎంఎల్‌పురం కాలనీ, లోకొండ, గులుమూరు, దుర్భలాపురం, జగన్నాథపురం తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చెరువులో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



హరిపురం: పొద్దుమాడి చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

హరిపురం: చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఆర్డీవో డాక్టర్ భరత్ నాయక్ హెచ్చరించారు. హరిపురం గ్రామంలోని పెద్దమాడి చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు, ఆర్డీవోకు 'స్పందన'లో ఫిర్యాదులు రావ డంతో సదరు ప్రాంతాన్ని సందర్శించారు. ఎవరైనా పనులు చేపడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి చర్య లు తీసుకోవాలని తహసీల్దార్ ఎల్.తిరుమలబాబును ఆదేశించారు. ఆయనతో పాటు ఆర్ఐ చిన్నారావు, సర్వేయర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతం కాకుండా చూడండి

జమ్ము(నరసన్నపేట): జమ్ము పంచాయతీలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసు కోవాలని ఆర్డీవో రంగయ్య అన్నారు. బుధవారం స్థానిక కంకర కోనేరును పరిశీలించారు. అనాదిగా ఉన్న కోనేర్లను పరిరక్షించాలన్నారు. చెరువులు, బందలు ఆక్రమణలు కాకుం డా రెవెన్యూ అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకారావు, అప్పల నాయుడు, పంగ వెంకట రమణ, సర్వే అధికారులు పాల్గొన్నారు.

1108 జీవో రద్దు చేయాల్సిందే..



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

సంతబొమ్మాళి: కార్పొరేట్ సంస్థల యజమానుల చేతుల్లో బందీగా ఉన్న వేలాది ఎకరాల భూములు స్వదేశీ మత్స్యకారులకు, పేదలకు దక్కాలంటే 1108 జీవో రద్దు ఆవశ్యకమని, దీనికోసం పోరాటం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా నాయకుడు నంబారి వెంకటరావు అన్నారు. కాకరా పల్లి థర్మల్ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో పోలీసుల కాల్పుల్లో అమరవీరులైన జీరు నాగేశ్వరరావు, సీరపు ఎర్రయ్య, బత్తిన బారికయ్య 13వ వర్ధంతిని బుధవారం పోతునాయుడుపేట అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 13 ఏళ్లుగా సుమారు 60 గ్రామాల ప్రజలకు పాలకులు ఓట్ల కోసం మోసపూరిత హామీలిచ్చి వంచించారన్నారు. జీవోతో పాటు సుమారు 400 మందిపై ఉన్న కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వదేశీ మత్స్యకార సంఘాలకు తంపర భూములను అప్పగించి లీజు అనుమతులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాకరాపల్లి థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి ఎం.నర్సింగరావు, నాయకులు గన్ను, కారుణ్య కేశవ, కోత మధు, సోమేష్, కోత రమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తొలి ప్రాధాన్యం

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

హరిపురం: తాగునీటి సమస్యల పరిష్కారం తన మొదటి ప్రాధాన్యమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. సరియాపల్లి గ్రామంలో గ్లో సంస్థ ఆధ్వర్యంలో రూ.2 లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసిన పవర్ బోర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్దానం ప్రాజెక్టు ద్వారా తాగునీటి ఏర్పాటుకు కృషి చేశామన్నారు. ఎంపీ నిధులు రూ.5 లక్షలు గ్రామానికి మంజూరు చేస్తే సర్పంచ్ అడ్డుకున్నారని, దీంతో సొంత నిధులతో నీటి కొరత తీర్చామని చెప్పారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమని ఉద్దానానికి పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బావన దుర్యోధన, దాసరి తాతారావు, నేరియా హరిబందు, సర్పంచ్ కరిగాన వాసు, మల్లేశ్వరరావు, దశరథ, భీమారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ

వజ్రపుకొత్తూరు: శివసాగర్‌బీచ్ తీరంలో వెలసిన శ్రీనీలకంఠేశ్వర ఆలయ ప్రాంగణలో నిర్మించిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడురోజులుగా జరుగుతున్న కార్యక్రమాలు ముగిశాయి. బాతు పురం, పెదవంక, బైపల్లి, అక్కుపల్లి గ్రామా లకు చెందిన మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జలుమూరు: బుడితి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ తిమడాం ఫీడర్ లైన్‌లో చెట్టుకొమ్మలు తొలగిస్తున్నందున గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సురవరం, తిమడాం, పర్లాం, మాకివలస, గంగన్నపేట, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు అచ్చెన్న, రామ్మోహన్‌నాయుడు పర్యటన

నందిగాం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు గురువారం నందిగాం మండలంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి ఎం.బాలకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నందిగాం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో చర్చిస్తారని, 3 గంటలకు పెద్దబాణాపురంలో పర్యటిస్తారన్నారని సర్పంచ్ ఇందిరమ్మ, రమేష్‌నాయుడు దంపతులతో పాటు పలువురు టీడీపీలో చేరనున్నారని, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

16న జాతీయ లోక్‌అదాలత్

టెక్కలి: జాతీయ లోక్‌అదాలత్ మార్చి 9న నిర్వహించాల్సిన ఉండగా 16వ తేదీకి వాయిదా వేసినట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులు ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నా మన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీయే రాజమార్గమని, లోక్‌అదాలత్ తీర్పు అంతిమమన్నారు.

● **నరసన్నపేట:** జాతీయ లోక్ అదాలత్ మార్చి 16న నిర్వహించనున్నందున దీనిపై కక్షిదారుల్లో మరింత అవగాహన కలిగించాలని స్థానిక మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ సూచించారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో పోలీసులు, ఎస్ఈబీ అధికారులు, న్యాయ వాదులతో సమావేశం నిర్వహించారు. ఇరు పార్టీల అంగీకారంతో లోక్‌అదాలత్‌లో వివాదాలను శాశ్వతంగా పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులకు ఈ అవకాశం సద్వినియోగం చేసుకునేలా వారికి పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రసాదరావు, ఎస్ఐ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


నరసన్నపేట: సత్యవరంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న బగ్గు రమణమూర్తి


సారవకోట మండలంలోని బొమ్మికపేట గిరిజన గ్రామంలో భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రం అందజేస్తున్న కత్తిరి వెంకటరమణ


నందిగాం: పెంటూరులో సూపర్‌సిక్స్ కరపత్రాలను అందజేసి వివరిస్తున్న టీడీపీ నాయకులు

'సూపర్ సిక్స్'తో రాష్ట్రాభివృద్ధి

- బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం

టీడీపీ అధినేత ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆపార్టీ నాయకులు తెలిపారు. బుధవారం జిల్లాలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

రామరాజ్యం కోసం పాటుపడాలి

నరసన్నపేట: రాష్ట్రంలో సాగుతున్న రాక్షస రాజ్యానికి చరమగీతం పాడి రామరాజ్యం కోసం పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి కోరారు. సత్యవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. టీడీపీతోనే రామరాజ్యం సాధ్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన కూటమి విజయం కోసం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు శిమ్మచంద్ర శేఖర్, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, పీస కృష్ణ, బెవర రాము పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన విజయానికి సహకరించాలి

జలుమూరు (సారవకోట): టీడీపీ అధినేత ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యపడుతుందని, రానున్న టీడీపీ- జనసేన ప్రభుత్వంలో వీటిని అమలు చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ తెలిపారు. బొమ్మికపేట గిరిజన గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను వివరించడంతో పాటు టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్ల ఆనందరావు, తర్ర లచ్చుము, డి.జయరాం, ఎం.గోవిందరావు, చల్ల జనార్దనరావు బలగ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పెంటూరులో కరపత్రాల పంపిణీ

నందిగాం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై పెంటూరులో ప్రచారం నిర్వహించారు. తెలుగుయువత ప్రధాన కార్యదర్శి బెండి గిరి ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ కరపత్రాలు అందించి వివరించారు. కార్యక్రమంలో కూర్మాపు ప్రసాదరావు, టి.రామయ్య, ఎం.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన అంతర్ జిల్లాల దొంగ

శ్రీకాకుళం క్రైం: రాష్ట్రంలో పలు జిల్లాల్లో నేరాలకు పాల్పడిన దొంగ రెండో పట్టణ పోలీసులకు చిక్కాడు. టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు కథనం మేరకు... తూర్పుగోదావరి జిల్లాలోని కోరుకొండ మండలంలో గాదరాడ గ్రామానికి చెందిన దేవన బుజ్జి ఈనెల 26 అర్ధరాత్రి దాటిన తర్వాత శ్రీకాకుళంలోని డేఅండ్ నైట్ కూడలిలో ఉన్న మహాలక్ష్మి మెడికల్ షాపు షట్టర్ తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డాడు.ఈమేరకు ఆ షాపు యజమాని రెండో పట్టణ పోలీసులకు 27న సమాచారం అందించాడు. దీంతో రంగంలోకి దిగిన సీఐ ఉమామహేశ్వరరావు షాపులోని సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి బుధవారం సాయంత్రం ఆర్ట్స్ కళాశాల రోడ్డు సంచరిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ హరికృష్ణ క్రైం పార్టీతో వెతకడం ప్రారంభించారు. స్టేడియం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా దేవన బుజ్జిని పట్టుకుని స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేశారు. దొంగతనానికి పాల్పడినట్లు బుజ్జి అంగీకరించడంతోపాటు షాపులో దొంగలించిన 83,900రూపాయలను పోలీసులు రికవరీచేశారు. అయితే బుజ్జిపై పలు జిల్లాల్లో చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

తంగినిలో గడ్డివాముల దగ్ధం

మెళియాపుట్టి: మండలంలోని తంగిని గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సవర రామస్వామి, గోపాల్ పంటపొలాల్లో గడ్డివాములు దగ్ధమయ్యాయి. బాధితులు, గ్రామస్థుల కథనం మేరకు.. కొంతమంది రైతులు పంటపొలాల్లో పిచ్చిమొక్కలు కాల్చడానికి అగ్గిపెట్టారు. ఆ మంటలు రాజుకుంటు గ్రామసమీపంలోఉన్న జీడి,మామిడి తోటలకు వరకు చేరాయి. అక్కడ ఉన్న గ్రామా నికి చెందిన రామస్వామి, గోపాల్, రామరావు, జోరమ్మ, భీమారావు, సుధాకర్, రామరావు, రాయిలమ్మకు సంబంధించి సుమారు నాలుగు ఎకరాల్లోని జీడిమామిడి మొక్కలుకాలిపోయాయి. ఈ విషయాన్ని ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు అంచనావేశారు. ప్రమాదం జరిగిన వెంటనే పలాస నుంచి అగ్నిమాపకశకటం వచ్చి మంటలు అదుపుచేసింది.

22(ఏ) నుంచి తొలగించాలి

- ఓవీపేట సచివాలయాన్ని ముట్టడించిన లచ్చయ్యపేట రైతులు


సచివాలయాన్ని ముట్టడించిన రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

బూర్జ: తమ భూములు 22(ఏ) జాబితా నుంచి తొలగించి హక్కులు కల్పించాలని లచ్చయ్యపేట రైతులు డిమాండ్‌చేశారు.ఈ మేరకు బుధవారం ఓవీపేట సచివాలయాన్ని రైతులు ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని ఉన్న లచ్చయ్యపేటలో సుమారు 74 ఎకరాల సాగుభూమిని రీసర్వే పేరుతో తారుమారు చేశారని ఆరోపించారు. తమ తాత తండ్రుల నుంచి సాగు చేస్తున్నామని, పాస్ పుస్తకాల ఉండడంతో సొసైటీలో రుణాలు పొందిన తర్వాత కూడా ఇలామార్చడం సమంజసం కాదని వాపోయారు. జనవరి తొమ్మిదోతేదీన తహసీల్దార్ సమక్షంలో సమావేశం నిర్వహించినా ప్రయోజనంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. రీసర్వేపేరుతో సుమారు 200 కుటుంబాలకు అన్యాయంజరుగుతోందని తెలిపారు.ఉద్దేశ్యపూర్వకంగా అధికారులు భూములను తారుమారు చేశారని ఆరోపించారు. సచివాలయం రైతులు ముట్టడించిన విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకొని అదుపు చేశారు. సమస్యలను ఉన్నతాధికారులదృష్టికి తీసుకెళ్తామని వారు హామీఇచ్చారు.

యుద్ధప్రాతిపదికన పూడిక తొలగించండి

- శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం అర్బన్: యుద్ధప్రాతిపదికన కాలువల్లో పూడికను తొలగించాలని, అవసరమైతే సిబ్బందిని పెంచాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిష నర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం శ్రీకాకుళంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన కాలువ పూడికతీత పనులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్యం అందరి బాధ్యతఅని, కాలువల్లో చెత్త వేయకుండా శానిటరీ సిబ్బందికి చెత్తను అందించాలని వ్యాపారస్థులను కోరారు.


కాలువలో పూడికతీత పనులు పరిశీలిస్తున్న తమీమ్ అన్సారియా

పార్వతీనగర్ కాలనీలో వైద్యశిబిరం

పొందూరు: పొందూరు పార్వతీనగర్‌కాలనీలో తాడివలస పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బుధవారం వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ ప్రాథమిక పరీక్షల్లో ముగ్గురు చిన్నారులకు డెంగ్యూలక్షణాలుగుర్తించడంతో వైద్యసిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈనేపథ్యంలో వారికి మెరుగైన చికిత్సకోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. దీంతో బుధవారం కాలనీవాసులకు రక్తపరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఎవరికీ తీవ్రమైన జ్వరలక్షణాలు లేవని వైద్యసిబ్బంది గుర్తించారు. కాలనీలో శానిటేషన్ నిర్వహించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఉన్నతాధికారులు


అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఉన్నతాధికారులు దర్శించుకున్నారు.ఈ మేరకుఆంధ్రప్రదేశ్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ డైరెక్టర్ వి.విజయలక్ష్మి దంపతులు, ఏపీఈడబ్ల్యూ ఐడీసీ ఛైర్మన్ బుధవారం వేర్వేరుగా దర్శించుకుని పూజలు చేశారు.వారికి ఆదిత్యఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికలను ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ బిఎస్ చక్రవర్తి వారికి అందజేశారు. కార్యక్రమంలో ఇప్పిలి సాందీప శర్మ, ఇప్పిలి రంజిత్ శర్మ, దర్భముళ్ల శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

హాల్‌టిక్కెట్లు నిరాకరిస్తే కాలేజీలపై చర్యలు

- ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ సభ్యుడు సీతారాం

గుజరాతీపేట/అరసవల్లి: ఫీజుల బకాయిలు, హాజరు సరిపడా లేదని షాకుతో రాష్ట్రంలోని ఏ ఒక్క విద్యార్థికైనా హాల్ టిక్కెట్ నిరాకరిస్తే సంబంధిత కళాశాలల గుర్తింపురద్దుతోపాటు, యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలకు సిఫారసు చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం బుధవారం ఒకప్రకటన హెచ్చరించారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా ఈ ఏడాది ఇంటర్ బోర్డు ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా నేరుగా హాల్ టిక్కెట్లు జారీ ప్రక్రియ ప్రారంభించిందని తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు వేధింపులకు గురిచేసినట్లు ఫిర్యాదులు ఉంటే చర్యలకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా బొడ్డేపల్లి సురేష్


బొడ్డేపల్లి సురేష్

శ్రీకాకుళం అర్బన్: బీసీ సంక్షేమ సంఘ డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యుడు బొడ్డేపల్లి సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ సురేష్‌ను నియమిస్తూ విజయవాడ రాష్ట్ర కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. కొవిడ్ సమయంలో కూడా సురేష్ సేవలందించారు. సురేష్ నియా మకంపై సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవభూషన్ హర్షం వ్యక్తం చేశారు.

అన్నిస్థానాల్లో పోటీచేస్తాం

- వైసీపీ హయాంలో విచ్చలవిడిగా గంజాయి రవాణా
- జై భారత్ పార్టీ అధినేత లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

శ్రీకాకుళం అర్బన్: తమ పార్టీ 175 స్థానాల్లో పోటీచేస్తుందని జైభారత్ పార్టీ అధినేత వీవీ లక్ష్మీనారాయణ తెలిపారు. అప్పు, అవినీతి, డ్రగ్స్, రౌడీయిజం, ప్రకృతి విధ్వంసం లేని ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రత్యేక హోదా సాధనే ధ్యేయమని తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014 నుం టీడీపీ-బీజేపీ, వైసీపీ-బీజేపీ ప్రభుత్వాలు అవకాశమున్నా హోదా సాధనపై దృష్టి సారించలేదన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్రం గంజాయి మయమయ్యిందని, విచ్చలవిడిగా గంజాయి రవాణాతో యువత మత్తుకు బానిసైపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఆలోచనతో వలంటీర్లను వినియోగించాలని ఆలోచనచేస్తోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు.విశాఖపట్నం నుంచి ఎంపీగా కానీ ఎమ్మెల్యేగా గానీ తాను పోటీచేసే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం పార్టీ మేనిఫెస్టోను లక్ష్మీనారాయణ విడుదలచేశారు. పార్టీలో చేరిన పలవురు యువతకు ఆయన కండువ వేసి ఆహ్వానించారు. పార్టీ నాయకులు ఇప్పిలి సీతారాజు, చీపురు రవి, రాగోలు నాగశివ, బాలకృష్ణ పట్నాయక్, బమ్మిడి ఉదయ్‌కుమార్‌లకు లక్ష్మీనారాయణ నియామక పత్రాలు అందజేశారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు జయదేవ్,లక్ష్మణరావు పాల్గొన్నారు.

సున్నా వడ్డీ రాయితీ విడుదల

కలెక్టరేట్: జిల్లాలో 1,25,655 మంది రైతు కుటుంబాలకు సున్నా వడ్డీ పంట రుణాల రాయితీ, పీఎం కిసాన్ పథకం కింద 3,21,930 మంది రైతు కుటుంబాలకు రూ.64.47 కోట్ల పెట్టుబడి సాయం అందించినట్లు కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి మీటనొక్కి మూడోవిడత నిధులను విడుదల చేసినట్లు కలెక్టర్ చెప్పారు. లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ నేతాజీ, అగ్రిమిషన్ సభ్యుడు గొండు రఘురామ్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి


కొత్తపాలెంలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జి.సిగడాం: వైసీపీ పాలనలో రాష్ట్రం అథో గతిపా లయ్యిందని బీజేపీ మండలాధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం విమర్శించారు. పాలఖండ్యాం, మెట్టవలస, సీతంపేట, నక్కపేట, గేదెలపేటలో నిర్వహించిన ప్రజాపోరు యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. అభివృద్ధిని పక్కన పెట్టి బటన్ నొక్కుడుతో రాష్ట్రాన్నిఅప్పులపాలు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, జి.అప్పలరాజు, ఎం.పోలారావు, పొగిరి దాశరధి,గౌరినాయుడు, అప్పారావు, శంకరరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

కవిటి: మోదీ సారథ్యంలో బీజేపీతో చేయి కలిపి మరింత అభివృద్ధిని సాధించేందుకు సహకరించాలని ఆ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ కన్వీనర్ బి.నిర్మలారెడ్డి కోరారు.మండలంలోని గొండ్యాలపుట్టుగ, కొత్తపాలెం,పెద్ద కర్రివానిపాలెం గ్రామాల్లో ప్రజాపోరు-2 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎ.సత్యం, పి.విశ్వనాథం, పి.కృష్ణవేణి, హేమ, నీలవేణి పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ అభ్యర్థిని గెలిపిస్తాం

- జనసేన రాష్ట్ర జాయింట్ కార్యదర్శి తిప్పన దుర్యోధన రెడ్డి

ఇచ్ఛాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బెందాళం అశోక్‌ను గెలుపించుకుంటామని జనసేనరాష్ట్ర జాయింట్ కార్యదర్శి తిప్పన దుర్యోధన రెడ్డి ఒకప్రకటనలో తెలిపారు. టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా టీడీపీకి కేటాయించడం మంచి పరిణామమే అని పేర్కొన్నారు. రాష్ట్రప్రజల భవిష్యత్ కోసం పవన్‌కల్యాణ్ నిర్ణయం శిరోధాబ ర్యమని తెలిపారు. ఇచ్ఛాపురం అసెంబ్లీ సీటు జనసేనకు కేటాయించకపోవడం మనసు కలసివేసిందని, అయినా తమ పార్టీ అదినేత తీసుకున్న నిర్ణయం శుభపరిణామమని పేర్కొన్నారు. ఊపిరి ఉన్నంత వరకు తన ప్రతీ అడుగు పవన్‌తోనే అని తెలిపారు.

'గ్రేడ్ ఫిక్సేషన్ చేసి న్యాయం చేయండి'

లావేరు: గ్రేడ్‌ఫిక్సేషన్ చేసి న్యాయం చేయాలనిఉపాధిహామీ పథకంలో పని చేస్తున్నసీవోలు,టీఏలు, ఏఏఎస్‌లు కోరారు.ఆశాఖ జేఏసీ పిలుపు మేరకు టీఏలు, సీవోలు బుధవారం లావేరు ఎంపీడీవో కొండలరావుకు వినతిపత్రం అందించారు.ఈసందర్భంగా టీఏలు ఆర్‌వీరమణ, చదువుల రవి, పి.హైమావతి, గౌతమ్, సీవోలుప్రసాద్, కోటి మాట్లాడుతూగతంలో పలుసార్లు అధికారులను కలిసినా ఫలితంలేకుండాపోయిందన్నారు. డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిలో ఉద్యోగులుగా నియమితులమైన మాకు న్యాయంచేయాలని కోరారు.

ఓటుహక్కు వినియోగించుకోండి: ఈఆర్వో

ఇచ్ఛాపురం: ఓటువజ్రాయుధం వంటిదని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈఆర్వో బి.సుదర్శన్‌దొర తెలిపారు. బుధవారం ఇచ్ఛాపురం తహసీల్దార్‌కార్యాలయం నుంచి స్వీప్‌ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఓటు ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. పాత బస్టాండ్ జంక్షన్‌లో మానవహారం ఏర్పాటుచేసి ప్రతిజ్ఞచేయించారు. కార్యక్రమంలో డీటీ శ్రీహరి, బీఎల్వోలు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్ల దినోత్సవం


సోంపేట: టైలర్ల దినోత్సవం నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

సోంపేట: పట్టణంలో టైలర్లదినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ టైలర్లకు 50ఏళ్లకు పింఛన్,200 యూనిట్లవరకు విద్యుత్‌ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాళిదాసు, బాలకృష్ణ,ఈశ్వరరావు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

- **శ్రీకాకుళంకల్చరల్:** శ్రీకాకుళంలో టైలర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో 30మంది టైలర్లకు కత్తెర, టేపు, స్కేలు అందజేసి సన్మానించారు.కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ ఛైర్‌పర్సన్ బాడాన దేవభూషణరావు పాల్గొన్నారు.
- **ఇచ్ఛాపురం:** పట్టణంలోని టైలర్స్‌యూనియన్ సభ్యులు సంఘ కార్యాలయంలో కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పి.హరికృష్ణ, కార్యదర్శి వైకుంఠరావు, తోపాటు 50 మంది టైలర్లు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి: వీసీ


గ్రంథాలయంలో పరిశీలిస్తున్న రజని

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ సిబ్బంది సమయపాలన పాటించాలని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. బుధవారం వర్సిటీలోప్రధానగ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది విధులకు ఆలస్యంగా రావడాన్ని గుర్తించిఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. ఉద్యోగులు,విద్యార్థులను ఆకట్టుకునేలా గ్రంథాలయం ఉండాలని తెలిపారు. లైబ్రరీ ర్యాక్‌లు, పుస్తకాలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. విద్యార్థులతో స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండాలని తెలిపారు.

వృత్తి విద్య కోర్సులతో ఉపాధి అవకాశాలు

రణస్థలం: వృత్తి విద్యకోర్సులతో ఉపాధిఅవకాశాలు లభిస్తాయని కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్.హైమావతి తెలిపారు. బుధవారం లంకపేట కేజీబీవీ పాఠశాలలోని తొమ్మిదోతరగతి, ఇంటర్ చదువుతున్నవిద్యార్థినులకు వృతివిద్య కోర్సులపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ నైపుణ్యం సాధించడం ద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అపెరల్ మెడి అప్స్ కోర్సులో భాగంగా విద్యార్థినుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ టి.జ్యోతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులకు అవగహన కల్పిస్తున్న హైమావతి

నేడు సర్పంచ్‌ల నిరసన

- హాజరుకానున్న బాబూరాజేంద్రప్రసాద్

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం: పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలని, పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద గురువారం సర్పంచ్‌లు నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడ యలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్ హాజరుకానున్నారు. పార్టీలకతీతంగా సర్పంచ్‌లు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ ఒక ప్రకటనలో కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లావేరు: చిలకపాలెం సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ కె.అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు మునిసిపల్ సమావేశం

ఇచ్ఛాపురం: మునిసిపల్ కౌన్సిల్ హాలులో సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎజెండాలో పొందుపరిచిన 16 అంశాలపై చర్చ జరగనుందని పేర్కొన్నారు.

3న జిల్లా సదస్సుకు తరలిరావాలి

శ్రీకాకుళం రూరల్: ఉపాధిహామీ చట్టం రక్షణకోసంవచ్చేనెల మూడోతేదీన యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించనున్న జిల్లా సదస్సుకు ఉపాధి వేతనదారులు తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గంగరాపు ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. బుధవారం రూరల్‌మండలంలోని కిష్టప్పపేటలో వేతనదారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం, దమయంతి, రోహిణి,గంగమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

టెట్‌కు 372 మంది హాజరు

ఎచ్చెర్ల: మండలంలో రెండుకేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో రెండుషిఫ్ట్‌ల్లో బుధవారం జరిగిన టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్‌కు(టెట్)372 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల(చిలకపాలెం)లో రెండుషిఫ్టుల్లో 200కు184 మంది, శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్‌కళాశాల (ఎచ్చెర్ల)లో 200కు 188 మంది హాజరయ్యారు. రెండు కేంద్రాల్లో కలిపి మొత్తం 400 మందికి 28 మంది గైర్హాజరయ్యారు.

శ్రీకూర్మనాథుని హుండీ లెక్కింపు

గార: శ్రీకూర్మనాథుని దేవస్థానం హుండీ ఆదాయం 110రోజులకు రూ.15.09 లక్షలు వచ్చిందని ఈవో గురునాథ్ తెలిపారు.పర్యవేక్షణఅధికారిగాశ్యామలరావు ఆధ్వర్యంలోజరిగినకార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో జాబ్ ఫెస్ట్

గుజరాతీపేట: శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో జరుగుతున్న జాబ్ ఫెస్ట్‌కు విశేష స్పందన లభించింది. మంగళవారం జాబ్ ఫెస్ట్‌కు 208 మందివిద్యార్థులు పాల్గొనగా 112 మంది అర్హత సాధించగా, బుధవారం 150 మంది పాల్గొనగా 64 మంది అర్హత సాధించారని ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు ప్రటించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు పర్యవేక్షణలో జరిగిన ఫెస్ట్‌కు ప్లేస్‌మెంట్ అధికారి ఐ.లక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ శంకరనారాయణ, పద్మావతి, రాంప్రసాద్‌కుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మత్స్య సంపద పథకంపై సమీక్ష

కలెక్టరేట్: ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం అమలుపై కలెక్టర్ కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయికమిటీతో సమీక్షించారు.ఈసందర్భంగా మత్స్యశాఖ ఏడీ పీవీ శ్రీనివాసరావు ఈ పథకం ద్వారా మూడేళ్లలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. సమావేశంలో పీడీ డీఆర్డీఏ విద్యాసాగర్, జడ్పీ సీఈఓ వేంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఈ తిరుమలరావు, నరసింగరావు పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. మరమ్మతులకు నోచుకోక

- బీటలు వారిన గోడలు
- తలుపులు, కిటికీలకు చెదలు
- ఇదీ శ్రీకూర్మనాథక్షేత్రంలో సత్రం పరిస్థితి

గార: శ్రీకూర్మనాథక్షేత్రంలో భక్తులసౌకర్యార్థం నిర్మించినసత్రం (చౌల్ట్రీ) శిథిలావస్థకు చేరుకుంది. భవనం నిర్మించి నాలుగు దశాబ్దాలు కావడంతో కనీస మరమ్మతులు లేకపోవడంతోపాటు నిర్వహణ లేక గోడలు బీటలు వారుతున్నాయి.తలుపులు, కిటికీలకు చెదలు పట్టాయి. దీనికితోడు ఆలయ అధికారుల నిర్లక్ష్యం పుణ్యమాని రెండు దశాబ్దాలుగా ఎనిమిది గదులు, కల్యాణ మండపం నిరుపయోగంగా మారాయి. పెచ్చులూడి పడు తుండడంతో ఇక్కడ భక్తులు ఉండేందుకు ముందుకురావడంలేదు.

ఇదీ పరిస్థితి

కూర్మనాథుని దర్శించుకునేందుకు ఉత్తరాంధ్రతోపాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం 1972లో ఇక్కడ పది గదులతో సత్రం నిర్మించింది. ఇక్కడకు శని,ఆదివారాల్లో 500 మంది వరకు, పర్వదినాల్లో 1000 మంది వస్తుంటారు. ఈ నేపథ్యంలో దీని నిర్వహణ బాధ్యతను ఆలయ అధికారులకు టీటీడీ అప్పగించింది. భక్తులు చాలామంది ఇక్కడ తక్కువ రుసుముతో వసతి పొందేవారు. అయితే శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వ హయాంలో ఈకాటేజీల మరమ్మతులకోసం టీటీడీ రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులు సరిపోవని, మరమ్మతులు చేసినా నివాసయోగ్యంగా ఉండ వని అప్పట్లో అధికారులు భావించారు. ఆ తర్వాత ఆ కాటేజీలను మరమ్మతులు చేయాలని ఈవిషయాన్ని స్థానికులు పలుదఫాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.సత్రం శిథిలావస్థకు చేరడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే వారు శ్రీకాకుళంలో హోటళ్లలో రాత్రిపూట ఉండి ఉదయం చేరుకుంటున్నారు.

పెరుగుతున్న భక్తులు

శ్రీకూర్మనాథక్షేత్రానికి కొద్దేళ్లగా దర్శించుకోవడానికి భక్తుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రం నుంచే కాకుండా ఒడిశా, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలనుంచి భక్తులువస్తున్నారు.వీరంతా స్వామివారిని దర్శించుకున్న తరువాత స్థానికంగా ఒకపూటఉండి విశ్రాంతి పొందేందుకు అవ సరమైన వసతిసౌకర్యం లేకపోవడంతో అవస్థలకు గురవుతున్నారు. శ్రీకూర్మంలో ప్రైవేటులాడ్జీలు కూడా లేకపోవడంతో గత్యంతరంలేక శ్రీకాకుళం రావాల్సి వస్తోంది.ఈనేపథ్యంలో నూతనభవనం నిర్మించాలని ఇటీవల ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు, స్థానికులు మంత్రి ధర్మాన దృష్టికి తీసుకువెళ్లారు.


శిథిలావస్థకు చేరి టీటీడీ సత్రం

మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం

శ్రీకూర్మం టీటీడీ సత్రం శిథిలావస్థకు చేరుకోవడంతో భక్తుల సౌకర్యార్థం నూతనంగా మరోసత్రం మంజూరుకు కృషి చేయాలని ఇటీవల మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లామని ట్రస్ట్‌బోర్డు సభ్యుడు అనుపోజు నాగరాజు తెలిపారు. ఆయన స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారని పేర్కొన్నారు. కాగా టీటీడీ సత్రం శిథిలావస్థకు చేరుకోవడంపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని ఆలయ ఇన్‌చార్జి ఈవో జి.గురునాథరావు చెప్పారు.